దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

## బీఆర్ఎస్ శ్రేణుల అణచివేతకు రేవంత్ సర్కార్ కుట్ర

- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- "కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతలు
- న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన రైతులను, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు కుట్ర
- ఇది రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనం.
- సీఎంగా విఫలమైన రేవంత్ తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే అరెస్టు లు
- జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా కూడా విడుదల చేయకుండా జాప్యం
- తమ పంటలను కాపాడుకునే ఏకైక తపనతో రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమ కేసులు బనాయించింది.

సంపుటి: 3 | సంచిక : 254 | మంగళవారం 22. 9. 2026 | ఎడిటర్ వేముల అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00

## స్పీకర్‌ను దూషించిన కేసు.. తాతా మధు, నవీన్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్: శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను దూషించిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వారిని అరెస్టు చేయొద్దంటూ గతంలో నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. నాంపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పీపీ నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను తాతా మధు, నవీన్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపైనా దాడి చేశారని చెప్పారు. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

# చాలా ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం

## రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


- అర్హులందరికీ ఇల్లు వచ్చేవరకు ఈ పథకం విడతల వారీగా ఇస్తాం
- రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- లబ్ధిదారులకు ఇల్లు కేటాయింపు పత్రాలు పంపిణీ
- "బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదు.
- అధికారం పోయాక.. పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారు.
- గత ప్రభుత్వం నగరానికి దూరంగా.. ప్రజలు ఉండలేని చోట ఇళ్లు నిర్మించింది.
- మేం రద్దీగా ఉండే, చాలా ఖరీదైన ప్రాంతాల్లో టవర్స్ నిర్మించి, ఇళ్లు ఇస్తున్నాం.
- పేదలయితే చాలు.. ఏ పార్టీ వారు అని చూడకుండా ఇల్లు మంజూరు చేస్తున్నాం.
- వచ్చే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభిస్తాం"
- ఎల్3 కేటగిరీలో ఉన్నప్పటికీ ఇల్లు నిర్మాణం ప్రారంభించినవారికి ప్రత్యేక అనుమతి
- ఎల్3లో ఉన్నప్పటికీ.. బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు నిధులు మంజూరు




## కాంగ్రెస్ భూ దందా?

ట్రాన్స్‌జెండర్లకు, కాంగ్రెస్ వాళ్లు చేసే దానికి తేడా లేదు

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



తొలి సమయం హైదరాబాద్ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీజేపీ లకు చెరో 8 ఎంపీ స్థానాలు ఇచ్చారు. కాంగ్రెస్ ఎంపీలు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ హరీష్ రావు ప్రైవేటు ప్రాపర్టీపై దాడి చేయడానికి వెళ్లారు. కాంగ్రెస్ వాళ్లు చెప్పి మిగతా 2లో..

## అక్టోబర్ 20 నుంచి అమల్లోకి భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ: గోయల్

దిల్లీ: భారత్- న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అక్టోబర్ 20 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఇది ఇరుదేశాల మధ్య పెట్టుబడులు, వ్యాపార సంబంధాలు మెరుగుపడేందుకు దోహదం చేస్తుందన్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య ఏప్రిల్ 27 ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం.. భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపైనా ఎలాంటి సుంకం ఉండదు. అంతేకాకుండా రానున్న 15 ఏళ్లలో న్యూజిలాండ్ 20 బిలియన్ యూఎస్ డాలర్ల మేర భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని గోయల్ తెలిపారు. "న్యూజిలాండ్‌తో మరింత బలమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు భారత్ నిబద్ధతతో వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే అక్టోబర్ 20న దసరా సందర్భంగా భారత్- న్యూజిలాండ్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం ప్రారంభం కాబోతోంది" అని గోయల్ వెల్లడించారు. ఈ



ఒప్పందం భారత్‌లోని వ్యవసాయ ఉత్పాదకతపైనా ప్రభావం చూపిస్తుందని, న్యూజిలాండ్ సాంకేతికత భారతదేశపు అవసరాలను, పెరుగుతున్న డిమాండ్‌ను తీరుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం చేకూరేలా ఈ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

## జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణం: జూపల్లి

తొలి సమయం హైదరాబాద్

జూరాల: జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు ( అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జూరాల దగ్గర అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాలలో ఆయన ఈమేరకు మాట్లాడారు. వరద లేని పరిస్థితుల్లో గేట్లు ఎత్తితే తాగునీటికి ఇబ్బంది కాదా? అని ప్రశ్నించారు. "కేసీఆర్ గతంలో 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్‌ను తీసుకొస్తామని చెప్పారు. జూరాల, భీమా ఆయకట్టుకు సింగోటం నుంచి నీళ్లు తెస్తామన్నారు. పాలమూరుపై అంత ప్రేమ ఉంటే రిజర్వాయర్లను ఎందుకు



నిర్మించలేదు? కేసీఆర్ రిజర్వాయర్లు కట్టకపోవడం వల్లే నీళ్లను నిల్వ చేసుకోలేకపోతున్నాం. పాలమూరు జిల్లాను ఎండబెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్ హయాంలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 30 శాతానికి మించలేదు. మా ప్రభుత్వంలో ఈ వాటా 43 శాతం వరకు ఉంది. నీటి కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ సర్కారు రాజీపడదు. 15 టీఎంసీలతో గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు ఇచ్చాం. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి ఇంకా నీళ్లు వస్తాయని భావిస్తున్నాం. ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను సరైన పద్ధతిలో ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చేస్తాం" అని అన్నారు.

## అమెరికా-ఇరాన్ యుద్ధం రూ.4 లక్షల కోట్ల ఖర్చు



అమెరికా, సెప్టెంబర్ 20 : అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేని పరిస్తితి. ఈ యుద్ధం అమెరికాకు ఆర్థిక భారంగా మిగిలింది. ఈ యుద్ధం కోసం ట్రంప్ ప్రభుత్వం చేసిన వ్యయం 45.1 బిలియన్ డాలర్లుగా తేలింది. అంటే మన కరెన్సీలో రూ.4.32 లక్షల కోట్లు అని ట్రంప్ ప్రభుత్వం యూఎస్ కాంగ్రెస్‌కు తెలిపింది. దాదాపు ఏడు నెలల నుంచి సాగుతున్న ఈ యుద్ధం కోసం అమెరికా మిగతా 2లో..

## తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రశ్నలు

### రోడ్లపైనే హత్యలు.. పెరుగుతున్న రౌడీయిజం.. పాలకుల నిర్లక్ష్యమే కారణమా?

తొలి సమయం డెస్క్ హైదరాబాద్ సెప్టెంబర్ 21

తెలంగాణలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రజలు, మేధావులు, యువతలో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న హత్యలు, దాడులు, బెదిరింపులు, రౌడీయిజం ఘటనలు ప్రజల్లో భయాందోళనకు కారణమవుతున్నాయనే చర్చ జరుగుతోంది.

రౌడీయిజం పెరగడానికి అసలు కారణం ఏమిటి? పోలీసుల నిఘా లోపమా? రాజకీయ జోక్యమా? నేరస్థులపై కఠిన చర్యలు లేకపోవడమా? లేక నేర చరిత్ర ఉన్న వ్యక్తులకు రాజకీయ అండదండలు లభిస్తున్నాయనే ఆరోపణలే కారణమా? అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

కొన్ని ప్రాంతాల్లో నేర చరిత్ర ఉన్న వ్యక్తులు బహిరంగంగా తిరుగుతున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. అయితే ఇటువంటి ఆరోపణలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టంగా ఖండించాల్సి ఉన్నా, నేరస్థులపై చట్టం సమానంగా అమలవుతోందా? అనే ప్రశ్న మాత్రం ప్రజల్లో కొనసాగుతోంది.

మరోవైపు, ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఇచ్చే ప్రాధాన్యత కంటే రౌడీషీటర్లు లేదా నేరచరిత్ర ఉన్న వ్యక్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? అనేది ప్రజాప్రతినిధులే స్పష్టం చేయాల్సి ఉంది.




### ప్రజాప్రతినిధుల ఆలోచన ఏమిటి?

ప్రజల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నేరస్థుడు ఏ పార్టీకి చెందినవాడైనా, రాజకీయ సంబంధాలు ఉన్నా లేకపోయినా చట్టం ముందు సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

రౌడీయిజాన్ని అరికట్టడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి? పోలీసులకు రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? నేరచరిత్ర ఉన్న వ్యక్తులకు రాజకీయ ఆశ్రయం లభిస్తోందా? ప్రజల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందా?

లాంటి ప్రశ్నలకు ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రధాన బాధ్యత. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదనేది ప్రజల ఆకాంక్ష.

## తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలి

### తిరుమల శ్రీవారిని ప్రార్థించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


తొలి సమయం హైదరాబాద్

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శ్రీవారిని ప్రార్థించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రకృతిపరంగా చోటుచేసుకునే వాతావరణ మార్పుల ప్రభావం ప్రజల జీవన విధానంపై, రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షపాతం, పంటలు, నదులు, తాగునీరు, సాగునీటిపై ప్రభావం పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యతపై



ముందుగానే అవగాహనతో వ్యవహరించడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. నీటి సంరక్షణను ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కూడిన సామాజిక బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

## 25న మహాగణపతి నిమజ్జనం



- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జనం

02

## ఫిరాయిస్తే రద్దవ్వాలి

### పకడ్బందీగా ఫిరాయింపుల చట్టం!

### పార్టీ ఫిరాయింపులపై చట్టంలో లోపాలను సరిచేయాలి

### కె. నారాయణ



తొలి సమయం హైదరాబాద్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఉన్న లోపాలను సరిచేయకుండా వదిలేయడం వల్ల దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే పరిణామాలు జరుగుతున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల్లో ఏ అభ్యర్థి ఏ పార్టీ తరపున పోటీ చేశారో ఎన్నికల మిగతా 2లో..

## గణేష్ ఉత్సవాల మహాన్నదాత రామరాజు యాకన్న అద్వితీయం...



**తొలి సమయం మహబూబాబాబాద్ సెప్టెంబర్ 21**

మహబూబాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోని 20వ వార్డులో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు వార్డు ప్రజలు నిరంతరం భక్తి శ్రద్ధలతో గణనాధుని పూజిస్తున్నారు. మహన్నదానం కార్యక్రమాలు నిరవధికంగా చేస్తున్నారు.. 21వ తారీకు సోమవారం మహన్నదానాన్ని నిర్వర్తించారు.. పట్టణ ప్రజలందరూ కూడా 20వ వార్డులో అన్నదాన సౌకర్యం ఉన్నదని హాజరవుతున్నారు.. రామరాజు యాకన్న ఆధ్వర్యంలో జరిగే ఈ మహన్నదాన కార్యక్రమానికి ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని దిగ్విజయం చేశారు

## గూడూరులో నామమాత్రంగా మారిన ప్రజావాణి!

### అధికారుల గైర్హాజరుపై ప్రజల అసంతృప్తి.. సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక ఆవేదన



**తొలి సమయం/కొత్తగూడ : మహబూబాబాద్ 21 ఆగష్టు 2026**

ప్రజా సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం గూడూరులో నామమాత్రంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వివిధ శాఖలకు చెందిన అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణికి మండలంలోని కీలక శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ కొందరు అధికారులు గైర్హాజరు కావడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. హాజరయ్యే కొద్దిమంది అధికారులు కూడా ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో వినడం కంటే హాజరు నమోదు, ఫొటోలు దిగడం వంటి కార్యక్రమాలకే పరిమితమవుతున్నారని మండలవాసులు పేర్కొంటున్నారు.

ప్రజావాణి ప్రారంభమైన కొద్దిసేపటికే శాఖాపరమైన అత్యవసర పనులు ఉన్నాయంటూ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోతున్నారని, దీంతో తమ సమస్యలను ఎవరికి వివరించాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలతో మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు ప్రజావాణి ద్వారా తక్షణ పరిష్కారం లభించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ప్రజావాణి కార్యక్రమాన్ని కేవలం ఒక సాధారణ కార్యక్రమంగా కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించే వేదికగా అధికారులు భావించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి సోమవారం అన్ని ప్రధాన శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకునేలా పర్యవేక్షణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఆహార భద్రతలో కొత్త అధ్యాయం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**తొలి సమయం। సూర్యాపేట। నూతనకల్ , సెప్టెంబర్ 21**



నూతనకల్ మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి స్మార్ట్ కార్డుల పంపిణీ చేశారు. ఇందులో భాగంగా కట్ట మల్లారెడ్డి మాట్లాడుతూ రెండున్నర ఏళ్లలో 62 లక్షల కొత్త రేషన్ కార్డులు కాంగ్రెస్ పార్టీ మంజూరు చేసిందని ఆయన అన్నారు ఆహార భద్రతలో నూతన అధ్యాయానికి స్మార్ట్ కార్డు పంపిణీ తెరలేపిందని అన్నారు. సన్న బియ్యం పంపిణీలో పారదర్శకంగా ఆహార భద్రత అందించేలా ఈ స్మార్ట్ కార్డును రూపొందించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి నాగరాజు, స్థానిక సర్పంచ్ పాండవుల లింగయ్య, ఉపసర్పంచ్ గంట నాగమణి రవిశంకర్, జిపిఓ రామయ్య, పంచాయతి సెక్రటరీ వెంకట్ రెడ్డి గంట రామకృష్ణ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు గోసను రాజకీయం చేయొద్దు

- **కేటీఆర్‌ను కలిసిన రైతు వెంకట రాములు.. తన మాటలను వక్రీకరించారని ఆవేదన**

**తొలి సమయం పెబ్బేరు సెప్టెంబర్ 21**

కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా ప్రెస్‌మీట్లు నిర్వహిస్తూ రైతుల సమస్యలను కూడా రాజకీయ అంశాలుగా మార్చుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సోమవారం పెబ్బేరు ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలపై స్పందించారు.ఇటీవల కేటీఆర్ పెబ్బేరు ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా ఆయనను రైతులు కలిసి తమ సమస్యలను వివరించారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గుమ్మడం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సాగునీటి సమస్యలను కూడా ఆయనకు వివరించామని చెప్పారు.

### నా మాటలను వక్రీకరించారు: రైతు వెంకట రాములు

ఈ సందర్భంగా గుమ్మడం గ్రామానికి చెందిన రైతు వెంకట రాములు మీడియా ముందుకు వచ్చి తన ఆవేదనను వివరించారు. సింగోటం రిజర్వాయర్, జూరాల ప్రాజెక్టు పరిధిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తాను కేటీఆర్‌కు చెప్పానన్నారు.“రైతులకు నీరు అందకపోతే పంటలు ఎండిపోతాయి. రైతులు తీవ్రంగా నష్టపోతారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. గతంలో 24 గంటల విద్యుత్ అందేదని, నీటి విషయంలో కూడా రైతులకు ఇబ్బందులు తక్కువగా ఉండేవని కేటీఆర్‌కు నా ఆవేదనను చెప్పాను” అని వెంకట రాములు తెలిపారు.తాను కేటీఆర్‌ను ప్రశ్నించడానికి లేదా వ్యతిరేకంగా మాట్లాడడానికి వెళ్లలేదని, రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే మాట్లాడానని స్పష్టం చేశారు. తన మాటలను కొందరు సోషల్ మీడియాలో









వక్రీకరించి, తాను కేటీఆర్‌ను నిలదీశానంటూ ప్రచారం చేయడం బాధ కలిగించిందన్నారు.

### రైతుల సమస్యలు పరిష్కరించాలని మాత్రమే కోరాను

తన గ్రామంలోని రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్, సాగునీటి సమస్యలను కేటీఆర్‌కు వివరించానని వెంకట రాములు చెప్పారు. రైతులకు నీరు, విద్యుత్ సకాలంలో అందకపోతే పంటలు దెబ్బతింటాయని, రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని కేటీఆర్ తనతో చెప్పారని వెంకట రాములు తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో రైతుల తరఫున మరింతగా పోరాడుతామని కేటీఆర్ చెప్పినట్లు ఆయన వివరించారు.“రైతు లేకపోతే సమాజానికి తినడానికి తిండి ఉండదు. రైతు సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా సమస్యగా చూడాలి. నేను చెప్పిన మాటలను వక్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరికాదు” అని వెంకట రాములు అన్నారు.

### శవరాజకీయాలు’ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కౌంటర్

ఇటీవల కాంగ్రెస్ నాయకులు చేసిన ‘శవరాజకీయాలు’ వ్యాఖ్యలపై కూడా బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. మరణించిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు కేటీఆర్ వచ్చారని, ఆ సందర్భాన్ని కూడా రాజకీయ కోణంలో చూడటం సరైంది కాదని అన్నారు.కేటీఆర్ పర్యటనలో రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం రాజకీయ కార్యక్రమం కాదని, మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకుడి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నమేనని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.అవగాహన లేకుండా వ్యక్తిగత విమర్శలు చేయకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యల కోసం తాము పనిచేస్తామని, రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### రైతు సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం

పెబ్బేరు మండలంలో రైతులు ప్రధానంగా సాగునీరు, విద్యుత్ సరఫరా, రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. సింగోటం రిజర్వాయర్‌కు సంబంధించిన పనులు పూర్తయితే గోపాల్‌దిన్నె రిజర్వాయర్ వరకు నీరు చేరి రైతులకు ప్రయోజనం కలుగుతుందని రైతులు ఆశిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్న సమయంలో సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారని తెలిపారు.రైతుల అసలు సమస్యలను పక్కనపెట్టి ఎవరు ఎవరిని విమర్శించారు అనే అంశాల చుట్టూ రాజకీయాలు చేయడం వల్ల రైతులకు ప్రయోజనం ఉండదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రైతుకు నీరు, విద్యుత్, పంటకు భరోసా కల్పించే చర్యలే ప్రధానమని పేర్కొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్షను అరికట్టాలి

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం**

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 21:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ గౌరవ శ్రీ బక్కి వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, వివక్ష, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల అమలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్ మాదిగ, ఇల్లందుకు చెందిన దళిత జర్నలిస్ట్, దళిత రత్న అవార్డు గ్రహీత నిట్ట సుదర్శన్ ఆధ్వర్యంలో కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం



అందజేశారు. వినతిపత్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, వివక్షను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్) కేసుల నమోదు, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు తదితర అంశాల్లో జరుగుతున్న జాప్యం, అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారం చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించి, అర్హులైన బాధితులకు నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు.దళితులపై దాడులు, వివక్షకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులు సీరియస్‌గా తీసుకుని, బాధితులకు న్యాయం జరిగేలా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు జీడి శ్రీనివాస్, జె. శ్రీను, జిల్లా నాయకులు తగరం శ్రీనివాస్, ఇనగంటి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుక డా. సతీష్ యాదవ్‌కు ఘన సన్మానం

**తొలి సమయం,వనపర్తి, సెప్టెంబరు 21**

అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు,హైదరాబాద్--రంగారెడ్డి జిల్లాల హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఎస్ఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో పౌర సన్మానం నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన పలువురు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో ప్రజా సమస్యలపై పోరాడిన సతీష్ యాదవ్ ప్రస్తుతం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనూ మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తూ, అఖిలపక్ష ఐక్యవేదికను విస్తరిస్తూ ప్రశ్నించే గొంతుకగా నిలవడం సంతోషకరమన్నారు. నీతి, నిజాయితీతో ప్రజల కోసం పనిచేయడం అగ్నిపరీక్ష లాంటిదని, దానిని సతీష్ యాదవ్ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ అధ్యక్షుడు నర్సిరెడ్డి, రిటైర్డ్ రిజిస్ట్రార్



మల్లారెడ్డి, పిచ్చయ్య, రిటైర్డ్ ఆర్మీ అధికారి నాగభూషణం రావు, హుబ్లీ విశ్వనాథం, సత్యనారాయణరాజు, ఆత్మకూరు బద్రీనాథ్, రిటైర్డ్ ఎమ్మార్వో భాస్కర్‌రెడ్డి, యాదగిరి, టీఆర్పీ అధ్యక్షుడు విజయ్‌యాదవ్, జలంధర్, మారం మహేందర్, ప్రదీప్, జమ్ముల శ్రీనివాస్, విశ్వనాథ్, కృష్ణారావు, నాగేందర్, రామశర్మ, పేపర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ వలలో యువకుడు రూ.85 వేల నష్టం

- **వాట్సాప్ హ్యాక్.. కాంటాక్ట్ నంబర్లకు వరుసగా మెసేజ్లు**
- **ఈ-చలాన్ పేరుతో వచ్చిన అనుమానాస్పద**

**ఏపీకే ఫైల్ను క్లిక్ చేయడంతో**

**తొలి సమయం/కొత్తగూడ : మహబూబాబాద్ 21 ఆగష్టు 2026**

కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన షేక్ అసిఫ్ రూ.85 వేల నష్టపోయినట్లు తెలిపారు. ఆర్టీవో ఈ చాలన్ పేరుతో వచ్చిన ఫైల్ ను ఓపెన్ చేసిన అనంతరం తన ఖాతా నుంచి నగదు పోయినట్లు తెలుస్తోంది. ఇంతటితో ఆగని సైబర్ నేరగాళ్లు అసిఫ్ వాట్సాప్ ఖాతాను కూడా హ్యాక్ చేశారు. అందులోని కాంటాక్ట్ నంబర్లకు గుర్తుతెలియని మెసేజ్లు, లింకులు పంపుతున్నట్లు బాధితుడు తెలిపారు. దీంతో అసిఫ్ స్నేహి తులు, బంధువులు, పరిచయస్తులు అప్రమ త్తంగా ఉండాలని కోరుతున్నారు. తన నంబర్ నుంచి వచ్చే ఏ మెసేజ్ కూ స్పందించవద్దని, ఎలాంటి లింక్ క్లిక్ చేయొద్దన్నారు.అనుమానాస్పదంగా ఉన్న ఎవరికీ డబ్బులు పంపొద్దన్నారు. నా పరిస్థితి మరెవరికీ రాకూడదు” అంటూ అసిఫ్ ఆవేదనతో విజ్ఞప్తి



చేశారు. విషయం తెలుసుకున్న కొత్తగూడ ఎస్సే రాజ్ కుమార్ వెంటనే స్పందించి, బాధితుడి ఖాతాను హోల్డ్ చేయించి, సైబర్ కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. డబ్బు లావాదేవీల వివరాలను పరిశీలిస్తూ తదుపరి చర్యలు చేపడుతున్నారు. ఈ-చలాన్ పేరుతో వచ్చే గుర్తుతెలియని మెసేజ్ లు, లింకులు, ఏ.పీ.కే ఫైళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడ ఎస్సై రాజ్ కుమార్ సూచించారు.

## వివేకానంద యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.





**తొలి సమయం పెబ్బేరు సెప్టెంబర్ 21**

పెబ్బేరు మండలం కేంద్రంలోని రంగాపురం గ్రామంలో భగవంతు రెడ్డి కాలనీలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు భక్తిశ్రద్ధలతో భగవంతుని పూజిస్తూ భజన పాటలు ఆలపిస్తున్నారు.సోమవారం వినాయక మండపం వద్ద వివేకానంద యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు .భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## వెంకటాపురంలో శాలివాహన యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



**తొలి సమయం శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 21**

శ్రీరంగాపూర్ మండలం వెంకటాపురం గ్రామంలో వినాయక చవితి పర్వదినాన్నిపురస్కరించుకుని శాలివాహన సంఘం యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామానికి చెందిన దాతలు శంకర్, మురళి, చంద్రబాబు ముగ్గురు సంయుక్తంగా దాతలుగా వ్యవహరించి అన్నదానానికి సహకరించారు.ఈ కార్యక్రమంలో అన్నదానానికి పిఏసిఎస్ చైర్మన్ జగన్నాథ నాయుడు హాజరై అన్నప్రసాద వితరణను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండడం అభినందనీయమని, దాతల సేవలు గొప్పవని కొనియాడారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. వినాయక మండపం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్నిస్వీకరించారు.ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 21:**

ఉప్పరపల్లి గ్రామంలోనీ మూడవ వార్డులో ఏర్పడిన నీటి సమస్యపై ఆ గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి స్పందించి 50 వేల విలువగల నూతన మోటార్ ను ఏర్పాటు చేశారు. దాంతో మూడో వార్డులో ఏర్పడిన నీటి సమస్య తొలిగిపోవడంతో వార్డు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వార్డులోని నీటి సమస్యపై తన దృష్టికి రావడంతో వెంటనే ప్రజలు ఎదుర్కొంటున్న అట్టి సమస్యను తొలగించి నీటి కష్టాలు తీర్చడం జరిగిందని తెలిపారు.?ఈ కార్యక్రమంలో జీజుల సందీప్,రాజబోయిన శ్రీనివాస్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం.



**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 21:**

ఇల్లందు, గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామపంచాయతీ కుంజా వారి గుంపులో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా సుకనయ్య, ఇర్పా కాంతారావు,ఇర్పా శంకర్, కాయం కమలాకర్, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా అంజనపురి కాలనీ--జనగాం రహదారి

- **భారీ వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా మారిన రోడ్డు**
- **ప్యాచ్‌వర్క్‌తో సరిపెట్టడంపై కాలనీవాసుల ఆగ్రహం**

**తొలి సమయం / సూర్యాపేట, తొలి సమయం, సెప్టెంబర్-21**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంజనపురి కాలనీ నుంచి జనగాం వైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులకు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జాతీయ రహదారి జనగాం క్రాస్ వద్ద అండర్‌పాస్ వంతెన పనులు కొనసాగుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు ప్రత్యామ్నాయ మార్గంగా ఈ రహదారి మీదుగా పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఇప్పటికే దెబ్బతిన్న రహదారి మరింత



అధ్వానంగా మారింది. వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై గుంతల్లో నీరు నిలిచి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని, రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో కూడా వర్షాల కారణంగా రహదారిపై గుంతలు ఏర్పడటంతో కాలనీవాసులు నిరసన వ్యక్తం చేసినట్లు నేపథ్యంలో అప్పట్లో అధికారులు ప్యాచ్‌వర్క్ చేపట్టి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించినప్పటికీ, కొద్దికాలానికే రహదారి మళ్లీ దెబ్బతిన్నదని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం భారీ వాహనాల రాకపోకలు పెరగడంతో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారిందని, కేవలం తాత్కాలిక ప్యాచ్‌వర్క్‌లకు పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. చిన్న చిరు జల్లులు, ఓ మోస్తరు వర్షాలకు ఇలా ఉంటే పెద్ద వర్షం వస్తే రోడ్డు పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారి ప్రమాదాలకు కారణమవుతుందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రహదారిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని, గుంతలను పూడ్చి నాణ్యమైన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులు,సంబంధిత పాలకులను కోరుతున్నారు. అండర్‌పాస్ పనులు పూర్తయ్యే వరకు భారీ వాహనాల రాకపోకల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**సూర్యాపేట జిల్లాలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్లు**

**తొలి సమయం, సూర్యాపేట సెప్టెంబర్ 21**

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ముందు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సూర్యాపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా యూనియన్ అధ్యక్షులు తాటిపాముల నాగలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని, ఇతర శాఖల పరిధిలోని డ్యూటీ విధులు అప్పగించరాదని కోరారు.అంగన్‌వాడీ సెంటర్లలోనే ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించాలని, ప్రీ ప్రైమరీలను వేరుగా



నిర్వహించే విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు తగిన అధికారి/సిబ్బంది ఏర్పాట్లు చేయాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు, కనీస మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛంద సంఘాల పేరుతో సెంటర్లకు విధించే అదనపు బాధ్యతలను తగ్గించాలని, ప్రైవేట్/ఇతర పనిభారాన్ని అంగన్‌వాడీ సిబ్బందిపై మోపరాదన్నారు.అలాగే ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.5 లక్షలు, ఆయాలకు రూ.3 లక్షలు చెల్లించాలని యూనియన్ డిమాండ్ చేసింది.అంగన్‌వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మండలాల అంగన్వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం: జగదీష్ రెడ్డి

**తొలి సమయం, సూర్యాపేట ၊ పెన్‌పహాడ్ సెప్టెంబర్ 21:**

మండలంలోని నూర్జహాన్‌పేట, గూడెపుకుంట తండా గ్రామాల్లో ఎండిన పంట పొలాలను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం చీదెళ్ల సబ్‌స్టేషన్‌లో లాగ్‌బుక్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు పంటలను దూరం చేస్తున్న పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, నీళ్లు, విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం సక్రమంగా సరఫరా చేయలేకపోతోందని విమర్శించారు. రైతుల పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, పంటలు చేతికొచ్చే సమయంలో నీరు, కరెంట్ కొరతతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. 24





గంటల విద్యుత్ అందించే అవకాశాలు ఉన్నాయని, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వినియోగిస్తే నీటి కొరత ఉండదని పేర్కొన్నారు.రైతుల సమస్యలపై రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం స్పందించాలని, పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమం చేపడుతుందని జగదీష్‌రెడ్డి హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్, సాగునీరు అందించామని ఆయన పేర్కొన్నారు.



# ఎస్ఐఆర్ --2026పై రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి..

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**
- **ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి**
- **అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**



**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 21**

ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం, హైదరాబాదు నుంచి ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ , ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని




ఆదేశించారు.అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్--2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు.ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు. ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై, సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, డి ఆర్ ఓ నాగలక్ష్మి, ఆర్డీవోలు రాజేశ్వరి గణేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, సూపర్డెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

## జిల్లా స్థాయికి శ్రీ వివేకవర్ధిని విద్యార్థుల ఎంపిక



**తొలి సమయం ;కేసముద్రం/ (మహబూబాబాద్) సెప్టెంబర్ 21:**
కేసముద్రం మండలంలోని పెనుగొండ గ్రామంలో ఈ నెల 18, 19 తేదీలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ జోనల్ స్థాయి క్రీడా పోటీలలో మహమూదుపట్నం శివారులోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-17 విభాగంలో భూక్య విజయ్, అండర్-14 విభాగంలో భూక్య మోహన్, అజ్మీరా జ్ఞానేశ్వర్, కోకో అండర్-17 విభాగంలో వాంకుడోత్ భరత్, కుందే ప్రణయ్, వాంకుడోత్ నగేశ్, కోకో అండర్-14 విభాగంలో బానోత్ అనిరుద్, గుగులోతు నవదీప్, వాలీబాల్ అండర్-14 విభాగంలో చిలుకూరి శ్రీచందు, సపావట్ మోహన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ చిర్రయు యాకాంతం గౌడ్, ప్రిన్సిపల్ చిర్ర నరేశ్ విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని, జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకుల కృషి ఎంతో ఉందని కొనియాడారు.

## ఘనంగా అన్నదాన కార్యక్రమం.



**తొలి సమయం, ఇల్లందు!సెప్టెంబర్, 21:**
ఇల్లందు, ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని సుదిమల్ల గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం భక్తులు, గ్రామ ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు సాదరంగా అన్నప్రసాదం అందించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చెరువు కట్టపై స్వచ్ఛతా కార్యక్రమం.






**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 21:**
ఇల్లందు: ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని హనుమంతులపాడు గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా చెరువు కట్టపై పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గణపతి నిమజ్జనం, దసరా ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని చెరువు కట్టపై పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించారు. గ్రామస్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా సుకనయ్య , వార్డు సభ్యులు, శంకర్ , కాయం కమలాకర్ , ధనకొండ రవి ,గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌తో సతమతమవుతున్న ప్రజలు.

**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 21:**



ఇల్లందు: ఓటర్ల వివరాలను 2002--03 నాటి పాత జాబితాలతో సరిపోల్చే ఎస్ఐఆర్ ప్రక్రియతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాతకాలం నాటి పత్రాలు అందుబాటులో లేకపోవడంతో పలువురు ఓటర్లు ఆధారాలు సమర్పించేందుకు అవస్థలు పడుతున్నారు. అవసరమైన పత్రాల కోసం ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుండటంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. అర్హులైన ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన పత్రాలు త్వరగా అందేలా ప్రభుత్వ కార్యాలయాలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్షను అరికట్టాలి

### కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం.

**తొలి సమయం, భద్రాద్రి కొత్తగూడెం; సెప్టెంబర్, 21:**



భద్రాద్రి కొత్తగూడెం, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, వివక్షను అరికట్టడంతో పాటు అట్రాసిటీ కేసుల్లో జాప్యాన్ని నివారించాలని టి. ఎమ్. ఆర్. పి . ఎస్ .నాయకులు కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశానికి హాజరైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు టి. ఎం .ఆర్. పి. ఎస్ .రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్ మాదిగ, దళిత జర్నలిస్ట్ నిట్ట సుదర్శన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, బాధితులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం సకాలంలో అందేలా చూడాలని కోరారు. దాడులు, వివక్షపై వచ్చే ఫిర్యాదులను అధికారులు సీరియస్‌గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టి.ఎం. ఆర్ .పి . ఎస్ . నాయకులు జీడి శ్రీనివాస్, జె. శ్రీను, తగరం శ్రీనివాస్, ఇనగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పోలీసులమంటూ బంగారు వ్యాపారులకు డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు

- **రూ.4.20 లక్షల వరకు అక్రమ వసూళ్లు.. నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్**
- **వివరాలు వెల్లడించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్**

**తొలి సమయం కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 21:**
వ్యవస్థీకృత నేర సమూహంగా ఏర్పడి, పోలీసులుగా నటిస్తూ బంగారు వ్యాపారులను ఫోన్ ద్వారా బెదిరించి, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను కేసముద్రం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు పోలీస్ యూనిఫాంను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ తెలిపారు. అలాగే అరెస్టయిన నిందితలు 1. షేక్ ఇర్ఫాన్, తండ్రి ఖాజా మొయినుద్దీన్, వయస్సు 29 సంవత్సరాలు, వృత్తి వ్యాపారం, నిడమనూరు గ్రామం మరియు మండలం, నల్గొండ జిల్లా,2. చింతలచేరువు ప్రశాంత్, తండ్రి సైదులు, వయస్సు 26 సంవత్సరాలు, వృత్తి ఆటో డ్రైవర్, నిడమనూరు గ్రామం మరియు మండలం, నల్గొండ జిల్లా చెందినవారీగా గుర్తింపు.

**పోలీస్ అధికారిగా నటిస్తూ బంగారు వ్యాపారికి ఫోన్**

నిందితుడు షేక్ ఇర్ఫాన్ పోలీస్ యూనిఫాం ధరించి ఫొటో తీసుకుని, దానిని వాట్సాప్ యాప్ మరియు ట్రూ కాలర్ డిపిలో ఉపయోగించాడు. అనంతరం కేసముద్రం మండలానికి చెందిన బంగారు వ్యాపారి బోగోజు వేణుగోపాల చారి ఫోన్ నంబర్‌ను గూగుల్ పే ద్వారా సేకరించి, 10.09.2026న అతనికి ఫోన్ చేశాడు.




తాను వికారాబాద్ సమీపంలోని పార్వతీపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పరిచయం చేసుకుని, ఇద్దరు దొంగలను పట్టుకున్నామని, వారు దొంగిలించిన బంగారాన్ని బాధితుడు కొనుగోలు చేశాడని, అందుకు సంబంధించిన రసీదులు తమ వద్ద ఉన్నాయని చెప్పి బెదిరించాడు. తాను కొనుగోలు చేసిన బంగారాన్ని రికవరీగా ఇవ్వకపోతే వచ్చి అరెస్ట్ చేస్తామని, అరెస్ట్ చేస్తే పరువు, మర్యాదలకు భంగం కలుగుతుందని భయపెట్టాడు. అనంతరం డబ్బులు పంపించాలని వాట్సప్ యాప్ ద్వారా క్యూ ఆర్ కోడ్ పంపించి, బాధితుడి నుంచి రూ. 88,026/- అక్రమంగా వసూలు చేశాడు.

**సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు**

ఈ ఘటనపై కేసముద్రం ఎస్ఐ కేసు నమోదు చేయగా, కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సైబర్ క్రైమ్ పోర్టల్ వివరాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లను విశ్లేషించి నిందితులను గుర్తించారు. కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ, కేసముద్రం ఎస్ఐ కె. క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు 20.09.2026 సాయంత్రం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

**రెండు తెలుగు రాష్ట్రాల్లో బంగారు వ్యాపారులే లక్ష్యం**

విచారణలో నిందితులిద్దరూ ఇదే తరహాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని బంగారు వ్యాపారులను పోలీసులమని బెదిరిస్తూ, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఆన్‌లైన్ ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. 15.08.2026 నుంచి 15.09.2026 వరకు సుమారు రూ. 4,20,000/- మేరకు బలవంతపు వసూళ్లకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**గతంలోనూ పలు కేసులు**

2024--25 సంవత్సరాల్లో నిందితులు తమ గ్రామానికి చెందిన చింతలచేరువు రవి, షేక్ వాజిద్, చింతలచేరువు అక్షిత్ తదితరులతో కలిసి వ్యవస్థీకృత నేర సమూహంగా ఏర్పడి, పోలీసులుగా నటిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని బంగారు వ్యాపారులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.
నిందితులపై నల్గొండ ×-టౌన్, ఆదిలాబాద్ ×-టౌన్, ఎచ్చోడ, కట్టంగూర్, తిరుమలగిరి, రామగూడెం, బిక్కవోలు పోలీస్ స్టేషన్లలో గతంలో పలు కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో అరెస్ట్ అయి జైలు నుంచి విడుదలైన అనంతరం కూడా నేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

**పోలీస్ యూనిఫాం, మొబైల్ ఫోన్ స్వాధీనం**

అరెస్టయిన నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్, పోలీస్ యూనిఫాంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీసుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు, అనుమానాస్పద క్యూఆర్ కోడ్‌లు, ఆన్‌లైన్ డబ్బు డిమాండ్లకు ప్రజలు స్పందించవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేసి, సంబంధిత సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు

# గణనాథుడే ప్రకృతి స్వరూపం.

**సి సి బి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్.**

**తొలి సమయం, కామేపల్లి; సెప్టెంబర్, 21:**
కామేపల్లి: మండలంలోని పండితాపురం కొత్తకాలనీ సెంటర్‌లో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, పీఏసీఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు ప్రారంభించారు. ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ గణపతి ప్రకృతి స్వరూపమని, మట్టితో తయారు చేసిన గణనాథుడిని నవరాత్రుల అనంతరం ప్రకృతిలోనే నిమజ్జనం చేయడం సంప్రదాయమన్నారు. గణనాథుని సేవతో సర్వ విఘ్నాలు తొలగిపోతాయని, ప్రజలందరూ సుఖసంతోషాలతో,



పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను మల్లిబాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు, సర్పంచ్



ధరావత్ అనురాధ, ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు అభినందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాటి బిక్షమయ్య మృతికి టీపీటీఎఫ్ నేతల నివాళి

**తొలి సమయం, ఆళ్లపల్లి:సెప్టెంబర్, 21:**
ఆళ్లపల్లి: మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తాటి బిక్షమయ్య మృతి చెందడంతో టీపీటీఎఫ్ నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. గతంలో టేకులపల్లి మండల టీపీటీఎఫ్ అధ్యక్షుడిగా సేవలందించిన బిక్షమయ్య, అనంతరం ఆళ్లపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. టీపీటీఎఫ్ జిల్లా



అధ్యక్షులు గుగులోతు హరిలాల్, ప్రధాన కార్యదర్శి జోగా రాంబాబు, జిల్లా కార్యదర్శి గుగులోతు భాగ్యరావు, ఇల్లందు మండల అధ్యక్షులు భూక్య వెంకట్‌రామ్, ప్రధాన కార్యదర్శి పాయం సర్వేశ్వరరావు తదితరులు బిక్షమయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హనుమంతుల పహాడ్‌లో ఘనంగా కుంకుమ పూజ

**శ్రీ రాధాకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు.**

**తొలి సమయం, ఇల్లందు:సెప్టెంబర్, 22:**
ఇల్లందు, ఇల్లందు మండలం సుదిమల్ల, గ్రామపంచాయతీ పరిధిలోని హనుమంతుల పహాడ్‌లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ రాధాకృష్ణ యూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, అనంతరం మహిళలు సామూహికంగా కుంకుమ పూజ చేపట్టారు. భక్తులు



గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, పూజా మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది. వినాయక చవితి సందర్భంగా నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులను భాగస్వాములను చేస్తూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ రాధాకృష్ణ యూత్ సభ్యులు తెలిపారు. గ్రామంలో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వినాయకుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. కుంకుమ పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు శ్రీ రాధాకృష్ణ యూత్ సభ్యులు, గ్రామస్తులు సహకరించారు.

# భాదిత కుటుంబానికి కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరు సమ్మిగౌడ్ చేయూత

- **సారయ్య ముదిరాజ్ పిల్లల ఉన్నత చదువులకు భరోసా..**
- **దశదిన కర్మకు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల అందజేత**

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 21:**
కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల సంఘం సభ్యుడు కీర్తిశేషులు మొలకల సారయ్య ముదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మిగౌడ్ పీసీసీ సభ్యులు దస్రునాయక్ తో కలిసి శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారి దుఃఖంలో తానూ భాగస్వామినని తెలిపారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సారయ్య పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి ఉన్నత చదువులకు తన వంతు సహాయం అందిస్తానని చిలువేరు సమ్మిగౌడ్ హామీ ఇచ్చారు. దశదిన కర్మ కార్యక్రమాలకు తన వంతు సహాయంగా 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు గుగులోతు దసురు నాయక్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు వాటిని అందించారు. ఆపదలో ఉన్న కుటుంబాన్ని పలకరించి,



మాటలకే పరిమితం కాకుండా అవసరమైన సమయంలో చేయూత అందించిన చిలువేరు సమ్మిగౌడ్‌కు కాట్రపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబానికి అండగా నిలవడంతో పాటు పిల్లల చదువుకు సహాయం చేస్తానని హామీ ఇవ్వడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్రపల్లి గ్రామ ఉపసర్పంచ్ చాగంటి యాదగిరి, గ్రామ కమిటీ అధ్యక్షులు జల్లె యకాంబరం, ఉపాధ్యక్షులు పుట్ట ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులు జాటోత్ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు కాలేపాక కలమ్మ, లక్ష్మయ్య, కర్పూరపు వెంకటేశ్వర్లు, సాంబారి వీరస్వామి, బోదాసు చంద్రయ్య, అడప రవీందర్, శీలం యాదగిరి, దెబ్బట సూరయ్య, కుంచం మునీందర్, కాలేపాక కృష్ణవేణి, వంశీ, ఏఐడీఎఫ్ నాయకులు గడ్డం నాగార్జున, బాదావత్ నరేష్, ఆంగోతు శివ, జాటోత్ లాల్‌సింగ్, గూగులోత్ సురేష్, ఆంగోతు వీరు ,పోలేపాక శ్రీనివాస్, గుండెపాక మాణిక్యం ౹ పాల్గొన్నారు.

PUBLICATIONS AND PRINTERING BY VEMULA AYODHYA RAMULU, H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506101, TELTEL NO 12283, PHONE NUMBER 9000689544...